సాక్షి నిజామాబాద్

శుక్రవారం । 18 । ఆగస్టు । 2023



ప్రతిపక్షాల మాటలు వినొద్దు

కాంగ్రెస్, బీజేపీల మాటలు విని ప్రజలు మోసపోవద్దని మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి పేర్కొన్నారు.

- 8లో ▸



ప్రమాదకరంగా కాలువలు

శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నుంచి నీటిని సరఫరా చేసే లక్ష్మి, కాకతీయ కాలువలు శిథిలావస్థకు చేరుకున్నాయి.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం

32.2 /23.9

వాతావరణం

ఉదయం చిరుజల్లులు కురియవచ్చు. ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం ఉక్కపోతగా ఉంటుంది. సాయంత్రం వర్షం కురిసే అవకాశముంది.

ఆగని కడుపు కోతలు

- ప్రైవేటు ఆస్పత్రుల్లో ప్రతి నెలా 89 శాతం పైగానే సిజేరియన్లు
- కలెక్టర్ హెచ్చరించినా మారని తీరు
- నోటీసులు ఇచ్చి, చేతులు దులుపుకున్న అధికారులు



నిజామాబాద్ నాగారం : జిల్లాలోని ప్రైవేట్ ఆస్పత్రుల్లో కడుపు కోతలు ఆగడం లేదు. డెలివరీ కోసం గర్భిణులు ఆస్పత్రికి వెళ్తేచాలు.. నార్మల్ డెలివరీ ప్రస్తావనే ఉండదు. సిజేరియన్ చేయడం.. ఇబ్బడిముబ్బడిగా బిల్లులు వసూళ్లు రాబట్టడం జరుగుతోంది.

గతంలో జిల్లా కలెక్టర్‌గా పనిచేసిన నారాయణ రెడ్డి హయాంలో ప్రత్యేక అధికార బృందాలు ఏర్పాటు చేసి ఆస్పత్రుల్లో తనిఖీలు చేయించారు. నోటీసులు జారీ చేశారు. ఫలితంగా ప్రైవేట్ ఆస్పత్రుల్లో 100 శాతం సిజేరియన్లు కాస్తా 89 శాతానికి వచ్చా యి. అయితే ప్రస్తుతం మళ్లీ యథావిధిగా కోతలు షురూ చేశారు. దీనిపై ఉన్న నియంత్రణ కమిటీ ఏం చేస్తుందో కూడా తెలియని పరిస్థితి నెలకొంది.

ఇదీ పరిస్థితి..

జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో సాధారణ డెలివరీలు చేస్తుంటే.. ప్రైవేటు ఆస్పత్రుల్లో సిజేరియన్లకు కళ్లెం పడడం లేదు. వైద్య ఆరోగ్యశాఖమంత్రి ప్రత్యేక దృష్టి పెట్టినా.. కలెక్టర్ పలుమార్లు తనిఖీలు, సమీక్షలు నిర్వహించి హెచ్చరికలు జారీ చేసినా తీరు మారడం లేదు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో జూలై నెలలో 60 శాతానికిపైగా సాధారణ డెలివరీలు జరిగితే, సిజేరియన్లు 40 శాతం వరకు అయ్యాయి. అదే ప్రైవేట్ ఆస్పత్రుల్లో మాత్రం 89 శాతం సిజేరియన్లు, 11 శాతం మాత్రమే సాధారణ డెలివరీలు జరిగాయి.

ప్రస్తుతం నిస్తేజం..

ప్రైవేట్ ఆస్పత్రుల్లో సిజేరియన్‌లపై ఉక్కుపాదం మోపిన జిల్లా అధికార యంత్రాంగం ప్రస్తుతం మౌనంగా ఉంది. కేవలం నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకున్నారు. చిన్న చిన్న క్లీనిక్‌లు రెండు, మూడు మాత్రం సీజ్ చేశారు. పెద్ద పెద్ద గైనిక్ ఆస్పత్రుల జోలికి వెళ్లలేదు. 75 ఆస్పత్రులకు నోటీసులు ఇచ్చినా వాటిలో కూడా సిజేరియన్ల సంఖ్య తగ్గకపోవడం గమనార్హం.

గతంలో నియమించిన ప్రత్యేక కమిటీ నామమాత్రమయ్యింది. గత సెప్టెంబర్ నుంచి జూలై వరకు 89 శాతానికిపైనే ప్రైవేట్ ఆస్పత్రుల్లో సిజేరియన్‌లు జరిగాయి. ప్రభుత్వ ఆస్పత్రుల్లో మాత్రం ప్రతి నెల సిజేరియన్లు తగ్గుతూ, సాధారణ డెలివరీ సంఖ్య 46 శాతం నుంచి 60 శాతం వరకు పెరిగాయి. ప్రతి నెల ఒక్క జీజీహెచ్‌లో 25 వరకు సాధారణ డెలివరీలు జరుగుతున్నాయి. ప్రైవేట్ ఆస్పత్రుల్లో మాత్రం సిజేరియన్లకు అడ్డూఅదుపు లేకుండా పోయింది.

తనిఖీలు చేసి..

గత కలెక్టర్ నారాయణరెడ్డి తన హయాంలో ప్రైవేటు ఆస్పత్రుల్లో సిజేరియన్ల నియంత్రణకు అధికారులలో 8 బృందాలు ఏర్పాటు చేసి 10 రోజుల పాటు ఆస్పత్రుల్లో తనిఖీలు చేయించారు. తద్వార బోధన్, ఆర్మూర్, నిజామాబాద్, భీమ్‌గల్ ప్రాంతాల్లోని సుమారు 75 ప్రైవేట్ గైనిక్ ఆస్పత్రులకు నోటీసులు ఇచ్చారు. అప్పుడు కాస్త ప్రైవేట్ ఆస్పత్రుల్లో సిజేరియన్లు తగ్గుముఖం పట్టాయి. తర్వాత క్రమక్రమంగా మళ్లీ సిజేరియన్లు పెరిగాయి.

ప్రైవేట్ ఆస్పత్రుల్లో 89 శాతం సిజేరియన్లు

జిల్లాలో ప్రభుత్వ ఆస్పత్రుల్లో సాధారణ డెలివరీల సంఖ్య బాగా పెరిగింది. 60 శాతం వరకు సాధారణ డెలివరీలు అవుతున్నాయి. 40 శాతం మాత్రమే సిజేరియన్లు చేస్తున్నారు. ప్రైవేట్‌లో 89 శాతం వరకు ప్రతినెలా సిజేరియన్లు చేస్తున్నారు.

– డాక్టర్ సుదర్శనం, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి

ప్రైవేట్ ఆస్పత్రుల్లో సాధారణ, సిజేరియన్ డెలివరీలు

నెల	సాధారణ	సిజేరియన్	మొత్తం	సిజేరియన్ శాతం	సాధారణ శాతం
ఏప్రిల్	47	336	383	88	30
మే	45	340	385	88	28
జూన్	35	262	297	88	26
జూలై	29	216	245	88	22
మొత్తం	92	676	768	88	26

ప్రభుత్వ ఆస్పత్రుల్లో సాధారణ, సిజేరియన్ డెలివరీలు

నెల	సాధారణ	సిజేరియన్	మొత్తం	సిజేరియన్ శాతం	సాధారణ శాతం
ఏప్రిల్	390	508	898	57	70
మే	428	572	1000	57	72
జూన్	377	474	851	56	74
జూలై	427	449	876	51	78
మొత్తం	818	1080	1898	55	74

సీఎం కేసీఆర్‌తోనే రాష్ట్ర అభివృద్ధి



మెందోరా గ్రామంలో శంకుస్థాపనలో పాల్గొన్న మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి

భీమ్‌గల్ : సీఎం కేసీఆర్‌తోనే తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి సాధ్యమవుతుందని రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. భీమ్‌గల్ మండలంలోని మెండోరా గ్రామం నుండి లింబాద్రి గుట్ట వరకు 4.30 కోట్లతో చేపడుతున్న బీటీ రోడ్డు, చేంగల్ నుండి చింతలూర్ మీదుగా 18.50 కోట్లతో డబుల్ లైన్ బీటీ రోడ్డు నిర్మాణ పనులకు గురువారం మంత్రి శంకుస్థాపన స్థాపన చేశారు. మంత్రి మాట్లాడుతూ కాంగ్రెస్, బీజేపీ పార్టీల నాయకులు ప్రజలను మభ్య పెట్టే ప్రయత్నం చేస్తున్నారని, ప్రజలు మోసపోవద్దన్నారు. కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి రైతులకు మూడు గంటల కరెంట్ చాలని అంటున్నాడని, పొరపాటున వాళ్లు అధికారంలోకి వస్తే రైతులకు మళ్లీ పాత రోజులే పునరావృతం అవుతాయని అన్నారు. అధికారంలో ఉన్నప్పుడు ప్రజలకు ఏమి చేయని కాంగ్రెస్ పార్టీ, ఇప్పుడు అధికారం కోసం అమలుకు నోచుకోని హామీలు ఇస్తూ ప్రజలను మభ్య పెడుతున్నారన్నారు. ఐదు రోజుల్లో పసుపు బోర్డు తెస్తానని రైతులను నమ్మించి గెలిచిన ఎంపీ అరవింద్ సీఎం కేసీఆర్‌ను, మమ్మల్ని వ్యక్తిగతంగా దూషణలు చేయడానికే సమయం కేటాయిస్తున్నారని విమర్శించారు. కార్యక్రమాల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఎడ్యుకేషన్ హబ్‌గా డిచ్‌పల్లి



సీఎంసీ ఆవరణలోని భవనాలను పరిశీలిస్తున్న ఆర్టీసీ చైర్మన్, రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్



కళాశాల కోసం ఎంపిక చేసిన భవనం ఇదే..

- సీఎంసీలో డిగ్రీ కళాశాల ఏర్పాటుకు పరిశీలన
- ఈ విద్యాసంవత్సరం నుంచే తరగతులు ప్రారంభం
- జాబ్ ఓరియెంటెడ్ కోర్సులు..
- ఆర్టీసీ చైర్మన్, రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్) : డిచ్‌పల్లి మండలంలో తెలంగాణ యూనివర్సిటీ, ప్రభుత్వ జూనియర్ కాలేజ్ ఉన్నాయని, ఇప్పుడు ప్రభుత్వ డిగ్రీ కాలేజ్ ఏర్పాటుతో డిచ్‌పల్లి ఎడ్యుకేషన్ హబ్‌గా మారుతుందని ఆర్టీసీ చైర్మన్, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. డిచ్‌పల్లి మండలానికి మంజూరైన ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు కోసం సీఎంసీ ప్రాపర్టీ బోర్డు ప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ గురువారం సీఎంసీ ఆవరణలోని భవనాలను పరిశీలించారు. చివరకు బాలికల హాస్టల్ భవనాన్ని ఎంపిక చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఈ ప్రాంత ప్రజల విజ్ఞప్తి మేరకు సీఎం కేసీఆర్‌తో మాట్లాడి గ్రామీణ ప్రాంత విద్యార్థులు ఉన్నత విద్యనభ్యసించేందుకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల మంజూరు చేయించినట్లు తెలిపారు. డిగ్రీ కళాశాల మంజూరుతో ఈ ప్రాంత ప్రజలు, విద్యార్థులు, తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. ఇదే విద్యాసంవత్సరం నుంచి డిగ్రీ కళాశాల తరగతులు ప్రారంభిస్తారని తెలిపారు. నిజామాబాద్ జిల్లాలోని ఇతర డిగ్రీ కళాశాలల్లో లేని జాబ్ ఓరియెంటెడ్ కోర్సులు డిచ్‌పల్లి డిగ్రీ కళాశాలలో ప్రవేశ పెట్టబోతున్నామన్నారు. విద్యార్థుల డిగ్రీ చదువు పూర్తయిన వెంటనే వారికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించేలా నూతన కోర్సులను ప్రవేశపెట్టేందుకు రాష్ట్ర విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి వాకాటి కరుణ, రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ రిక్క లింబాద్రిని సంప్రదించగా వారు సానుకూలంగా స్పందించారని తెలిపారు. 44వ నెంబరు జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న సీఎంసీ ఆవరణలో డిగ్రీ కళాశాల ఏర్పాటు వల్ల విద్యార్థులకు అన్ని విధాల అనుకూలంగా ఉంటుందన్నారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా డిగ్రీ కళాశాల ప్రారంభిస్తామని ఎమ్మెల్యే తెలిపారు. అడిగిన వెంటనే డిచ్‌పల్లికి డిగ్రీ కళాశాల మంజూరు చేసిన సీఎం కేసీఆర్ కు, కళాశాల కోసం భవనాన్ని ఇవ్వడానికి ముందుకు వచ్చిన సీఎంసీ యాజమాన్యానికి, బోర్డు సభ్యులకు రూరల్ ప్రజలు, విద్యార్థుల తరుపున ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఎంపిక చేసిన భవనం మరమ్మత్తు పనులకు అవసరమైన నిధుల మంజూరు కోసం జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతును కలిసి మాట్లాడుతానన్నారు. మరమ్మతులకు ఎంత ఖర్చవుతుందో ఎస్టిమేషన్ తయారు చేయాలని సంబంధిత ఇంజనీర్ అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. ఎమ్మెల్యే వెంట సీఎంసీ ప్రాపర్టీబోర్డు సభ్యులు శ్యాంసన్, చర్చి ఫాదర్ ఏసు కుమార్ స్టీఫెన్, దినకర్, ప్రమోద్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు చింత శ్రీనివాస్ రెడ్డి, సొసైటీ చైర్మన్ గజవాడ జైపాల్, నాయకులు నారాయణరెడ్డి, కృష్ణ, మోహన్‌రెడ్డి, సాయిలు, అమీర్, పద్మారావు, విఠల్, అంబర్‌సింగ్, నడిపన్న, అంజయ్య, యూసుఫ్, నవీన్, సుదాం, విజయ్, కార్యకర్తలు తదితరులున్నారు.

హైవేపై ఆకతాయిల హంగామా..

- అర్ధరాత్రి జాతీయ రహదారిపై తాగిన మత్తులో వీరంగం
- వాహనాలను నిలిపివేసి డ్రైవర్‌లను కొట్టిన వైనం
- అడ్డుకోడానికి వచ్చిన పోలీసులతో దురుసుగా ప్రవర్తించిన యువకులు
- కేసు నమోదు చేయవద్దని ఒత్తిడి తెచ్చిన ప్రజాప్రతినిధి
- కేసు నమోదు చేసిన పోలీసులు

మోర్తాడ్(బాల్కొండ): మద్యం మత్తులో కొందరు యువకులు మోర్తాడ్‌లోని జాతీయ రహదారిపై బుధవారం అర్ధరాత్రి హంగామా సృష్టించారు. వాహనాలను ఆపి తాళాలను లాక్కోవడమేకాకుండా డ్రైవర్‌లపై దాడికి పాల్పడిన ఘటన వెలుగులోకి వచ్చింది. మోర్తాడ్‌కు చెందిన ఐదుగురు యువకులు మద్యం మత్తులో తమ వాహనాలను జాతీయ రహదారిపై అడ్డుపెట్టి తాము పోలీసులమని వాహనదారులను బెదిరించి నిలిపివేయించారు. ఇదేమిటని ప్రశ్నించిన ఒక డ్రైవర్‌ను తీవ్రంగా చితకబాదారు. దాదాపు గంటసేపు జాతీయ రహదారిపై యువకులు వాహనాలను నిలిపివేయడంతో నిజామాబాద్, కరీంనగర్ రూట్‌లలో సుమారు 50 వాహనాలు నిలిచిపోయాయి. మద్యంకు బదులు గంజాయి సేవించిడం వల్లనే యువకులు వాహనాల్లోని వ్యక్తులు ఎంత చెప్పినా వినకుండా అందరిపై రెచ్చిపోయారని తెలుస్తోంది. యువకులు తామే పోలీసులమని చెప్పడంతో వాహనదారులు కొంత వెనకంజవేసి ఎవరికి ఫిర్యాదు చేయాలో అర్థం కాక అలాగే ఉండిపోయారు. అదే సమయంలో స్థానికులైన కొందరు నిజామాబాద్ రూట్ నుంచి మోర్తాడ్‌కు వస్తుండగా గొడవకు దిగిన యువకులు పోలీసులు కాదని గుర్తించి 100 నంబర్‌కు డయల్ చేశారు. దీంతో పెట్రోలింగ్‌లో ఉన్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మద్యం మత్తులో ఉన్న యువకులకు నచ్చజెప్పాలని చూశారు. తమను అడ్డుకుంటారా అని పోలీసులతో సదరు యువకులు దురుసుగా ప్రవర్తించడం గమనార్హం. పోలీసులు యువకులను పక్కకు నెట్టివేసి వాహనాలను వెళ్లనిచ్చారు.

ఇది ఇలా ఉండగా హైవేపై హంగామా సృష్టించిన యువకులపై కేసు నమోదు కాకుండా స్థానిక ప్రజాప్రతినిధి ఒకరు పోలీసులపై ఒత్తిడి తీసుకువచ్చినట్లు తెలుస్తుంది. పోలీసులు మాత్రం ఇందుకు అంగీకరించక పోవడం విశేషం.

ఎంతవారైనా ఉపేక్షించం

జాతీయ రహదారిపై హంగామా చేసిన యువకులు అబ్బు, సన్ని, సురేష్, ఫజ్జు, ఉమర్, కళ్యాణ్‌లపై కేసు నమోదు చేశాం. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన వారు ఎంతవారైనా ఉపేక్షించేది లేదు.

– అనిల్ రెడ్డి, ఎస్సై, మోర్తాడ్

వైన్స్‌లకు 1,653 దరఖాస్తులు

నేటితో ఆఖరు తేది

ఖలీల్‌వాడి : జిల్లాలోని 102 వైన్స్‌లకు గురువారం ఒకే రోజు 910 దరఖాస్తులు వచ్చినట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్ మల్లారెడ్డి తెలిపారు. ఇప్పటి వరకు మొత్తం 1653 దరఖాస్తులు వచ్చాయన్నారు. ఈ నెల 16 వరకు 545 దరఖాస్తులే రావడంతో ఎక్సైజ్ అధికారులు ఇబ్బందులు పడ్డారు. దీంతో జిల్లాలోని పరిస్థితి సమీక్షించేందుకు రాష్ట్రజాయింట్ కమిషనర్ యాసీన్‌ఖురేషీ వచ్చినట్లు ఎక్సైజ్ వర్గాల ద్వారా తెలిసింది. శుక్రవారం ఆఖరు రోజు కాగా దరఖాస్తు దారులు దరఖాస్తులు చేసుకోవాలని ఎక్సైజ్ సూపరిండెంట్ మల్లారెడ్డి సూచించారు. ఒక్కో వైన్స్‌కు 20 దరఖాస్తుల వరకు ఉంటేనే డ్రా తీస్తారనే ప్రచారం వాస్తవం కాదన్నారు. గత ఏడాది ఏడు దరఖాస్తులు వచ్చినా లాటరీ ద్వారా వైన్స్‌లను కేటాయించినట్లు తెలిపారు. గురు, శుక్రవారం దరఖాస్తులు ఎక్కువగా వస్తాయనే ఉద్దేశంతో ఐదు కౌంటర్ల నుంచి మరో ఏడు కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

దరఖాస్తుల సంఖ్య పెరగడంతో చెక్‌పోస్టుల వద్ద ఉన్న ఎక్సైజ్ సీఐలను కౌంటర్ల వద్ద నియమించినట్లు తెలిపారు. మధ్నాహ్నం దరఖాస్తు దారులకు భోజన వసతి ఏర్పాటు చేశారు.



దరఖాస్తులు స్వీకరిస్తున్న ఎక్సైజ్ అధికారులు

ఇక్కడ ఉచితం .. మహారాష్ట్రలో అమ్మకం

కిలోకు రూ.28

- జోరుగా సాగుతున్న రేషన్ బియ్యం దందా
- ఆహార భద్రత వినియోగదారుల నుంచి బియ్యం కొనుగోళ్లు
- మహారాష్ట్రకు తరలిస్తున్న దళారులు
- నిఘా లోపంతో ఆగని స్మగ్లింగ్



రేషన్ బియ్యం సంచుల్లో నింపుతున్న వ్యాపారి



మోర్తాడ్ పోలీసులు పట్టుకున్న రేషన్ బియ్యం

మోర్తాడ్/బాల్కొండ : మన రాష్ట్రంలో పంపిణీ అవుతున్న రేషన్ బియ్యానికి మహారాష్ట్రలో డిమాండ్ ఉండటంతో బియ్యం దందా జోరుగా సాగుతోంది. ఇక్కడ ఉచితంగా పంపిణీ అయ్యే బియ్యానికి మన పొరుగు రాష్ట్రంలో కిలోకు రూ.28 ధర పలుకుతుండటం విశేషం. బియ్యం దందాపై నిఘా లోపించడంతో ప్రతి రోజు పదుల సంఖ్యలో లారీల్లో బియ్యం అక్రమ రవాణా సాగుతోంది. ప్రతి యూనిట్‌కు ఐదు కిలోల చొప్పున బియ్యం పంపిణీ చేస్తున్నారు. జిల్లాలో ప్రతి నెలా 6,020 మెట్రిక్ టన్నుల బియ్యం వినియోగదారులకు రేషన్ దుకాణాల ద్వారా పంపిణీ చేస్తున్నారు. ఇందులో సగం కంటే ఎక్కువ బియ్యం వినియోగదారులు దళారులకు విక్రయిస్తున్నారు. రేషన్ దుకాణాల్లో బియ్యం పంపిణీ మొదలైన తెల్లవారు నుంచి చిన్నచిన్న వ్యాపారులు ఇంటింటికి తిరుగుతూ బియ్యం కొనుగోలు చేస్తున్నారు. ఒక్కో కిలోకు రూ.14 నుంచి రూ.17 వరకు వినియోగదారులకు చెల్లిస్తూ బియ్యంను వ్యాపారులు సేకరిస్తున్నారు. ఇలా సేకరించిన బియ్యంను బడా వ్యాపారులకు రూ.20 లకు విక్రయిస్తున్నారు. పెద్ద వ్యాపారులు బియ్యంను లారీల్లో లోడ్ చేసి పొరుగు రాష్ట్రంలో విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. ఒక్కో కిలో బియ్యంకు రూ.28 చొప్పున అంటే క్వింటాలుకు రూ.2,800లకు అమ్ముకుంటున్నారు. బియ్యం దందాలో బడా వ్యాపారులతో పాటు అధికార పార్టీకి చెందిన కొందరి హస్తం ఉండటంతో అధికారులకు చిక్కకుండా దందా సాగుతోంది. బియ్యం దందా వల్ల అందినకాడికి వెనుకేసుకుంటూ ప్రభుత్వ లక్ష్యానికి గండికొడుతున్నారు. ప్రభుత్వం చౌక ధరలకు బియ్యం విక్రయించి సామాన్యుల ఆకలి తీర్చాలని భావిస్తే బియ్యం దందాతో నాలుగు రాళ్లు వెనుకేసుకోవాలని వ్యాపారులు ఆలోచిస్తున్నారు. అక్కడ అక్కడ టాస్క్‌ఫోర్స్, విజిలెన్స్ దాడులు చేస్తూ బియ్యం నిలువలను పట్టుకుంటున్నా పెద్ద పెద్ద లారీల్లో తరలించే బియ్యంకు ఎలాంటి ఆటంకం ఉండటం లేదు. బియ్యం దందాపై ప్రభుత్వం సీరియస్‌గా దృష్టి సారిస్తేనే అక్రమార్కులకు చెక్ పెట్టవచ్చని పలువురు సూచిస్తున్నారు.

న్యూస్‌రీల్

5కె రన్‌ను విజయవంతం చేయండి

- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

సుభాష్‌నగర్ : భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈనెల 19న ఉదయం 6 గంటలకు జిల్లాలో 'ఐ ఓట్ ఫర్ షూర్' అనే నినాదంతో నిర్వహిస్తున్న 5కె రన్‌ను విజయవంతం చేయాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు గురువారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ప్రతి ఓటరు తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని, ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు వీలుగా జిల్లాలోని నిజామాబాద్ అర్బన్, నిజామాబాద్ రూరల్, బోధన్, బాన్సువాడ, ఆర్మూర్, బాల్కొండ అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 5కె రన్ నిర్వహిస్తున్నామని తెలిపారు. ఎన్నికల అధికారులు, సహాయ ఎన్నికల అధికారులు, అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, యువత, విద్యార్థినీవిద్యార్థులు, ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొని 5కె రన్ కార్యక్రమాలను విజయవంతం చేయాలని కలెక్టర్ కోరారు.

మూడు రోజులు వర్ష సూచన

రుద్రూర్: ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో మూడు రోజుల పాటు వర్షం కురిసే అవకాశం ఉందని రుద్రూర్ కృషి విజ్ఞాన కేంద్రం వ్యవసాయ వాతావరణ విభాగం శాస్త్రవేత్త శ్రీలక్ష్మి తెలిపారు. అల్పపీడనం ప్రభావంతో ఈ నెల 18,19, 20 తేదీల్లో ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన భారీ వర్షాలు (64.5 నుంచి 115.5 మి.మీ) కురిసే అవకాశమున్నట్లు వివరించారు. రైతులు పంట పొలాల్లో ఎటువంటి రసాయన మందులు పిచికారి చేయకుండా మూడు రోజుల వరకు వాయిదా వేసుకోవాలని సూచించారు.

ఎస్సారెస్పీకి పెరిగిన ఇన్‌ఫ్లో



బాల్కొండ : శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి ఎగువ ప్రాంతాల నుంచి వరద నీరు పెరిగింది. స్థానిక ఎగువ ప్రాంతాల నుంచి 4,675 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరింది. ప్రాజెక్ట్ నుంచి కాకతీయ కాలువ ద్వారా 3 వేల క్యూసెక్కులు, లక్ష్మికాలువ ద్వారా 100 క్యూసెక్కులు, సరస్వతి కాలువ ద్వారా 300 క్యూసెక్కులు, అలీసాగర్ ఎత్తిపోతల పథకం ద్వారా 360 క్యూసెక్కులు, గుత్ప ఎత్తిపోతల పథకం ద్వారా 135 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 628 క్యూసెక్కుల నీరుపోతుంది. ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటి మట్టం 1,091(90 టీఎంసీలు) అడుగులు కాగా గురువారం సాయంత్రానికి ప్రాజెక్ట్‌లో 1,090(84.81 టీఎంసీలు) అడుగుల నీరు నిల్వ ఉంది.

రైతులందరూ ఐక్యంగా ఉద్యమించాలి

ఖలీల్‌వాడి: చక్కెర ఫ్యాక్టరీలను తెరిపించేందుకు రైతులందరూ ఐక్యంగా ఉద్యమించాలని చెరుకు ఉత్పత్తిదారుల సంఘం కన్వీనర్ ఆకుల పాపయ్య అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆర్అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో గురువారం చెరుకు ఉత్పత్తిదారుల సంఘం, ఏఐకేఎంఎస్ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా పాపయ్య మాట్లాడుతూ.. ప్రజాప్రతినిధుల తప్పుడు విధానాలు, అవినీతి అధికారుల మూలంగా జిల్లాలోని బోధన్ ఎన్ఎస్ఎఫ్, సారంగపూర్‌లోని ఎన్సీఎస్ఎఫ్ చక్కె ఫ్యాక్టరీలు మూతపడ్డాయన్నారు. దీంతో అధికార, ప్రతిపక్ష రాజకీయ నాయకులు ఫ్యాక్టరీల భూములను చౌకగా కొట్టేయాలని అనేక ప్రయత్నాలు చేస్తున్నారని మండిపడ్డారు. సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీ మేరకు ఫ్యాక్టరీలను తెరిపించాలన్నారు. లేదంటే సారంగాపూర్ చక్కెర ఫ్యాక్టరీని 95యాక్ట్ ప్రకారం ఫ్యాక్టరీ అప్పులన్నీ మాఫీ చేసి రైతులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మి క సంఘాల నాయకులు నర్సయ్య, భూమ య్య, నాగయ్య, సాయిరెడ్డి, సంతోష్, ముప్పగంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎంను కలిసిన రాజేశ్వర్‌రావు



నిజామాబాద్ నాగారం: రాష్ట్ర క్రిస్టియన్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ రాజేశ్వర్ రావు గురువారం హైదరాబాద్‌లో సీఎం కేసీఆర్‌ని మర్యాదపూర్వకంగా కలిశారు. తనకు కార్పొరేషన్ చైర్మన్ పదవి ఇచ్చినందుకు సీఎంకు కృతజ్ఞతలు తెలిపి, సన్మానించారు.

క్లుప్తంగా

వరద కాలువ పరిశీలన



బాల్కొండ : శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నుంచి మిగులు జలాలను వదులేందుకు నిర్మించిన వరద కాలువను గురువారం నాబార్డు ప్రతినిధులు డిప్యూటీ జనరల్ మేనేజర్ శ్రీనివాస్, ఇరిగేషన్ రిటైర్డ్ చీఫ్ ఇంజినీర్ ఐఎస్ఎన్ రాజులు పరిశీలించారు. వరద కాలువ హెడ్ రెగ్యులేటర్‌ను, పునరుజ్జీవన పంపు హౌజ్‌ను పరిశీలించారు. కాలువ 102 కి.మీ వరకు పరిశీలిస్తామన్నారు. నిధులు మంజూరుపై ఉన్నత అధికారులకు నివేదిక ఇస్తామన్నారు. వారి వెంట డిప్యూటీఈఈ గణేష్, ఏఈఈ రామారావు తదితరులు ఉన్నారు.

మహమ్మద్ అబ్దుల్ ఖవికి అవార్డు



తెయూ(డిచ్‌పల్లి) : తెలంగాణ యూనివర్సిటీ ఉర్దూ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ మహమ్మద్ అబ్దుల్ ఖవికి రాష్ట్ర ప్రభుత్వం, ఉర్దూ అకాడమీ, రాష్ట్ర మైనార్టీ వెల్ఫేర్ విభాగం సంయుక్తంగా ఉత్తమ ఉర్దూ అధ్యాపక అవార్డు అందజేశారు. ఈ సందర్భంగా తెయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం యాదగిరి గురువారం అబ్దుల్ ఖవిని శాలువా కప్పి, మెమోంటో, ప్రశంసా పత్రం అందజేసి ఘనంగా సత్కరించారు. అవార్డు సాధించిన అబ్దుల్ ఖవి ని తెయూ ఇన్‌చార్జి వీసీ వాకాటి కరుణ, ఉర్దూ విభాగాధిపతి గుల్-ఇ-రాణా, బీవోఎస్ చైర్మన్ మూసా ఖురేషీ, అధ్యాపకులు సీహెచ్.ఆంజనేయులు, వాసం చంద్రశేఖర్, నాగరాజు తదితరులున్నారు.

కానిస్టేబుల్, హోంగార్డ్‌కు సన్మానం



కామారెడ్డి క్రైం : భిక్కనూరుకు సమీపంలోని ఓ దాబా వద్ద బుధవారం రాత్రి ఓ వ్యక్తి అనుమానాస్పదంగా తిరుగుతుండగా బ్లూకోల్ట్ కానిస్టేబుల్ గణేశ్, హోంగార్డు రమేశ్ గుర్తించారు. అతడిని పట్టుకుని వేలి ముద్రలను తనిఖీ చేశారు. దీంతో అతడు పాత నేరస్తుడని తేలింది. గతంలో చోరీల్లో నిందితుడిగా ఉండి జైలుకు వెళ్లి వచ్చాడు. వెంటనే అతడిని అదుపులోకి తీసుకుని భిక్కనూరు ఠాణాకు తీసుకువచ్చారు. సంగారెడ్డి జిల్లా నర్సాపూర్‌కు చెందిన మోహన్‌గా గుర్తించారు. ఈ ప్రాంతంలో దొంగతనాలు చేసేందుకు వచ్చినట్లు విచారణలో తేలింది. నిందితుడిని పట్టుకోవడంలో ప్రతిభ కనబర్చిన కానిస్టేబుల్, హోంగార్డులను జిల్లా పోలీస్ కార్యాలయంలో గురువారం ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి సన్మానించారు.

ప్రమాదకరంగా కాలువలు..!

- పలుచోట్ల కుంగిన కాలువ కట్టలు
- లక్ష్మి, కాకతీయ కాలువల దుస్థితి
- ఆందోళన వ్యక్తం చేస్తున్న ఆయకట్టు రైతులు



పోచంపాడ్ వద్ద కుంగిన కాకతీయ కాలువ కట్ట



ముప్కాల్ శివారులో గండిపడే ప్రమాదమున్న లక్ష్మీకాలువ కట్ట

బాల్కొండ : శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నుంచి నీటి సరఫరా చేసే లక్ష్మి, కాకతీయ కాలువలు ప్రమాదకరంగా ఉన్నాయి. కాలువల్లో నీటి ప్రవాహం వల్ల అక్కడక్కడా ఆనకట్టలు కోతకు గురై కుంగిపోయాయి. ప్రస్తుతం ఆయకట్టుకు నీటి సరఫరా జరుగుతోంది. దీంతో కాలువలకు ఎక్కడ ఎప్పుడు గండి పడుతుందోనని ఆయకట్టు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాకతీయ కాలువ ద్వారా ప్రస్తుతం వానాకాల సీజన్‌లో 6 లక్షల ఎకరాలకు, లక్ష్మి కాలువ ద్వారా 50 వేల ఎకరాలకు సాగు నీరు అందుతుంది. కాలువ ద్వారా పూర్తిస్థాయిలో నీటి విడుదల చేపట్టడానికి ప్రాజెక్ట్ అధికారులు జంకుతున్నారు. దీంతో కాకతీయ కాలువ ద్వారా గరిష్టగా 5,500 క్యూసెక్కులు, లక్ష్మి కాలువ ద్వారా ఇప్పటి వరకు 100 క్యూసెక్కులకు మించి వదలడం లేదు. కారణం కాలువ ఆనకట్టలు ప్రమాదకరంగా ఉండటమే కారణమని తెలుస్తోంది. కాకతీయ రాంసాగర్ ప్రాజెక్ట్ వద్ద పనులు, కాలువల పనులు అన్న ప్రభుత్వాలకు ఒకింత నిర్లక్ష్యమనే విమర్శలున్నాయి. ఎస్సారెస్పీ పనులు అంటేనే పాలకులకు చిన్నచూపు ఉంటుంది. 2007–2010 వరకు ఓఅండ్ఎం నిధులతో చేపట్టిన పనులు రచ్చకెక్కడం. అనేక మంది అధికారులు సస్పెన్షన్‌కు గురయ్యారు. ఇప్పటికీ విజిలెన్స్ తనిఖీలు సాగుతూనే ఉన్నాయి. ఆ సమయంలో అన్ని కాలువల సిమెంట్ లైనింగ్ చేపట్టారు. కాని మున్నాళ్లకే ముక్కలయ్యాయి. దీంతో కాలువల మరమ్మతులకు నిధులు అంటేనే ప్రభుత్వాలు మీన మేషాలు లెక్కిస్తున్నాయి.

మూడేళ్లుగా..

కాకతీయ కాలువ మరమ్మతుల కోసం మూడేళ్లుగా అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతూనే ఉన్నారు. లక్ష్మీ ఆధునికీకరణలో భాగంగా 2017లో రూ. 20 కోట్ల నిధులు మంజురయ్యాయి. కాని పనులు ఇంకా సాగుతునే ఉన్నాయి. ముందుగా చేపట్టిన పనులు మళ్లీ మరమ్మతులకు వచ్చినా ఇంకా పనులు పూర్తి కాలేదు. కాలువలకు గండి ఏర్పడక ముందే ప్రభుత్వం నిధులు మంజూరు చేసి మరమ్మతులు చేపట్టాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

సీజనల్‌గానే చేపట్టాలి..

శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నుంచి నీటి సరఫరా చేసే కాలువల మరమ్మతులు సీజనల్‌గానే చేపట్టాలి. వానాకాలం పంటకు నీటి విడుదల నిలిపి రబీ పంటలకు ప్రారంభించే సమయంలో ఎండు నెలలు, రబీ సీజన్ ముగింపు నుంచి వానాకాల సీజన్ ప్రారంభించే వరకు నాలుగునెలల సమయంలోనే పనులు చేపట్టాలి. కాని సకాలంలో కాంట్రాక్టర్లు, అధికారులు స్పందించకపోవడంతో పనులు పూర్తి కావడం లేదు. పాలకులు, ఉన్నత అధికారులు స్పందించి వెంటనే నిధులు మంజూరు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

ప్రతిపాదనలు పంపాం..

కాకతీయ కాలువ లైనింగ్ పనుల నిధుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరు కాగానే నీటి విడుదల లేని సమయంలో మరమ్మతులు చేపడుతాం. కాలువ ద్వారా నీటి విడుదలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నాం.

– రఘుపతి, డిప్యూటీ ఈఈ, కాకతీయ కాలువ

అటవీ అధికారులపై దాడి

- విధులకు ఆటంకం.. పలువురిపై ఫిర్యాదు



అటవీశాఖ భూమిని పరిశీలిస్తున్న అధికారులు

మాచారెడ్డి : మండలంలోని అక్కాపూర్ ఎల్లంపేట గ్రామాల మధ్య అటవీ భూమిని దున్నుతున్నారన్న సమాచారం మేరకు వెళ్లిన అటవీశాఖ అధికారులపై ఎల్లంపేట గ్రామస్తులు దాడి చేసి విధులకు ఆటంకపర్చారు. అటవీశాఖ రేంజ్ అధికారి పవన్‌కుమార్ బీట్ అధికారి తిరుపతి కథనం ప్రకారం బుధవారం రాత్రి ఒంటిగంట ప్రాంతంలో వచ్చిన సమాచారం మేరకు అటవీ సిబ్బందితో కలిసి సంఘటన స్థలానికి వెళ్లారు. అధికారుల రాకను గమనించిన ఎల్లంపేట గ్రామస్తులు నాలుగు ట్రాక్టర్లను తీసుకుని ఎల్లంపేటలోని వడ్డెర గూడెం వైపు పారిపోయారు. ఆ ట్రాక్టర్లను వెంబడిస్తూ పోలీసుల సాయంతో అక్కడికి అధికారులు చేరుకున్నారు. ట్రాక్టర్లను సీజ్ చేసే ప్రయత్నం చేస్తున్న అధికారులపై గ్రామస్తులు దాడికి పాల్పడడంతో పాటు విధులకు ఆటంకపర్చినట్లు అధికారులు తెలిపారు. ఈ మేరకు ఎల్లంపేట పరిధిలోని ఒడ్డె గూడెంకు చెందిన కుంచపు మైసయ్య, పల్లపు జగన్, పెనుగొండ రమేశ్, కుంచపు లింగం తో పాటు వీరికి సహకరించిన అక్కాపూర్ గ్రామానికి చెందిన బట్ట రాజనర్సు గడ్డం మహేష్ లపై ఫిర్యాదు చేశారు.

అక్రమ మ్యూటేషన్‌పై కార్యదర్శి నిలదీత

నిజామాబాద్ సిటీ : రూరల్ మండలం గుండారంలో ఓ స్థలాన్ని గ్రామ కార్యదర్శి అక్రమంగా మ్యూటేషన్ చేయడంపై గ్రామసభలో కార్యదర్శిని నిలదీశారు. గురువారం గుండారం జీపీ కార్యాలయంలో సర్పంచ్ లక్ష్మణరావు ఆధ్వర్యంలో గ్రామసభ జరిగింది. ఈ సభలో ఉప సర్పంచ్ శంకర్ రెడ్డి గ్రామంలో 600 గజాల స్థలాన్ని గ్రామ కార్యదర్శి అక్రమంగా ముటేషన్ చేశారని ఆరోపించారు. దీనికి గ్రామ కార్యదర్శి ముటేషన్ చేయటం అబద్ధమని కావాలంటే గ్రామసభ మినిట్ బుక్కులు చూసుకోవాలన్నారు. దీనిపై జీపీ పాలకవర్గం గ్రామ కార్యదర్శి మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. కాగా ఈ స్థలానికి సంబంధించి కోర్టులో కేసు సైతం వేయగా గ్రామ కార్యదర్శి తో పాటు స్థలానికి సంబంధించిన వారు కోర్టు కు హాజరవుతున్నారు.

నేడు జేపీఎస్‌లకు ఆర్డర్ కాపీలు

సుభాష్‌నగర్ : జిల్లా వ్యాప్తంగా 391 మంది జూనియర్ పంచాయతీ కార్మికులకు గాను 260 మందికి శుక్రవారం ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు రెగ్యులర్ చేస్తూ ఆర్డర్ కాపీలు ఇవ్వనున్నారు. నాలుగేళ్లు పూర్తి చేసుకున్న వారి పనితీరు, మార్కుల ఆధారంగా క్రమబద్ధీకరించాలని ప్రభుత్వం ఆదేశించిన విషయం తెలిసిందే. జిల్లాలో 530 జీపీలున్నాయి. అందులో 391 మంది జూనియర్ పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు. ముందుగా నాలుగేళ్లు పూర్తిచేసుకున్న 260 మందికి రెగ్యులరైజ్ చేస్తూ ఆర్డర్ కాపీలు ఇస్తారు. బాల్కొండలో శుక్రవారం మంత్రి ప్రశాంత్‌రెడ్డి జీపీఎస్‌లకు ఆర్డర్ కాపీలు అందజేయనున్నారు. ఆర్మూర్ 51మంది, బాల్కొండ 60 మంది, బోధన్ 46మంది, నిజామాబాద్ రూరల్ 77మంది, బాన్సువాడ 26మంది రెగ్యులర్ అయ్యారు.

డిగ్రీ, పీజీల్లో ప్రవేశాలకు గడువు పొడిగింపు

నిజామాబాద్అర్బన్ : అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం డిగ్రీ, పీజీ కోర్సుల్లో ప్రవేశానికి వచ్చే నెల 5వ తేదీ వరకు పొడిగించినట్లు అంబేద్కర్ ఓపెన్ వర్శిటీ కోఆర్డినేటర్ రంజిత ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీలో బీఏ, బీకాం, బీఎస్సీ, పీజీలో ఎంఏ, ఎంకాం, ఎంఎస్సీ, ఎంబీఏ కోర్సులు కలవన్నారు. ఎంబీఏ కోర్సుల్లో ఐసెట్ ఉత్తీర్ణులు కానివారికి ప్రవేశ పరీక్ష కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేయాలని 73829 29612లో సంప్రదించాలన్నారు.

ప్రతిపక్షాల మాటలు వింటే మోసపోతాం

మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి



వాడి గ్రామంలో డబుల్ రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి

వేల్పూర్ : కాంగ్రెస్, బీజేపీ మాటలు వింటే మోసపోతామని మంత్రి ప్రశాంత్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం ఆయన వేల్పూర్ మండలం వాడి గ్రామానికి పచ్చలనడ్కుడ నుంచి రూ. 4 కోట్ల 15 లక్షలతో నిర్మించే డబుల్‌రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులనుద్దేశించి మాట్లాడుతూ కాంగ్రెస్, బీజేపీలు మోసకారి మాటలు చెబుతూ బీఆర్ఎస్‌ను దూషిస్తున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న రాష్ట్రాలలో రూ. 2 వేల పింఛన్ ఇవ్వడం చేతగానివారు, తెలంగాణలో అధికారమిస్తే రూ. 4 వేల పింఛన్ ఇస్తామన్న మాటలు ఎలా నమ్ముతాం అని ప్రశ్నించారు. తెలంగాణాలో రైతులకు కేవలం 3 గంటల కరెంటు చాలు అన్న రేవంత్‌రెడ్డి కావాలా, 24 గంటల కరెంటు ఇచ్చే కేసీఆర్ కావాల్నో ప్రజలు ఆలోచించాలన్నారు. రైతులకు రుణమాఫీ చేయకుండా కాంగ్రెస్ పార్టీ కేసులు వేస్తోందని ఆరోపించారు. నేను సీఎం సహాయనిధి తెచ్చిన మాదిరిగా ఎంపీ అర్వింద్ పీఎం మోదీ ఎందును సహాయనిధి తెవడం లేదని ప్రశ్నించారు. వాడిలో దశల వారిగా అర్హులందరికి గృహలక్ష్మీ ద్వారా ఇళ్లు మంజూరవుతాయని చెప్పారు. గ్రామంలో విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి ప్రతిపాదనలు పంపినట్లు వెల్లడించారు. కార్యక్రమలో వైద్య ఆరోగ్య సంస్థ, కుటుంబ సంక్షేమ కమిషన్ చైర్మన్ డాక్టర్ మధుశేఖర్, డీసీసీబి వైస్ చైర్మన్ రమేశ్‌రెడ్డి, మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు జైడి నాగధర్‌రెడ్డి, నడ్కుడ సొసైటి చైర్మన్ లింబారెడ్డి, సర్పంచ్ గోపు మహేశ్, ఎంపీటీసీ శ్రీనివాస్, మండల గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, బిఆర్ఎస్ కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో ఎస్సీ బాలుర వసతి గృహం

- మాకొద్దు ఈ హాస్టల్ అంటూ రోడ్డెక్కిన విద్యార్థులు



ఐలాపూర్‌లో రాస్తారోకో చేస్తున్న విద్యార్థులు

నందిపేట్(ఆర్మూర్): శిథిలావస్థలో ఉన్న నందిపేట మండలం ఐలాపూర్ గ్రామ ఎస్సీ బాలుర వసతి గృహం స్థానంలో వేరే ప్రాంతంలో తమకు ఆశ్రయం కల్పించాలని డిమాండ్ చేస్తూ విద్యార్థులు రాస్తారోకో నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో గురువారం హాస్టల్ భవనం ఎదుట మెయిన్ రోడ్డు పై విద్యార్థులంతా తమ దుస్తుల పెట్టెలను పెట్టుకు నిధర్నా నిర్వహించారు. వసతి గృహాన్ని బాగుచేసి మా ప్రాణాలను రక్షించండి అంటూ నినాదాలు చేస్తూ దాదాపు అర్ధగంట సేపు ధర్నా నిర్వహించగా స్థానిక ఎంఈఓ శ్రీనివాస్ రెడ్డి, ఎస్సై విజయ్ కుమార్ సంఘటన స్థలానికి చేరుకొని విద్యార్థులకు నచ్చజెప్పి ధర్నాను విరమింప చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా సెక్రెటరీ అనిల్ మాట్లాడుతూ 1974లో కట్టిన భవనం శిథిలావస్థకు చేరుకుందన్నారు. ఉన్నతాధికారులు తదుపరి చర్యలు చేపట్టకుంటే విద్యార్థుల చేత కలెక్టరేట్ ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ సభ్యులు విద్యార్థులు పాల్గొన్నారు.

చోరీలు చేసిన నిందితుడి అరెస్ట్



మాట్లాడుతున్న సీఐ నరహరి

ఖలీల్‌వాడి : నగరంలోని దుబ్బ, గౌతంనగర్ ప్రభుత్వ పాఠశాలతో పాటు సుభాష్‌నగర్‌లోని రాఘవేంద్రస్వామి ఆలయంలో చోరీ చేసిన బాలనేరస్తుడితో పాటు సామగ్రి కొనుగోలు చేసిన వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు నగర సీఐ నరహరి తెలిపారు. నగరంలోని 3వ టౌన్ పీఎస్ ఏర్పాటు చేసిన సమావేశంలో నగర సీఐ మాట్లాడారు. గౌతంనగర్‌కు చెందిన వకోడ శివదొత్(21), దుబ్బకు చెందిన బాలనేరస్తుడు రాత్రి వేళల్లో ప్రభుత్వ పాఠశాలలోని ఆఫీస్‌రూం తాళాలు పగలగొట్టి అందులోని ఆంప్లిఫైర్‌తో పాటు రెండు సిలెండర్లు, రాఘవేంద్రస్వామి దేవాలయంలో పూజ సామన్లు ఇత్తడి, రాగి చీర చేసశారన్నారు. జల్సాలకు అలవాటు పడి శివదొత్, బాలనేరస్తుడు, చౌహాన్ అర్జున్‌లు ముగ్గురు చోరీలకు పాల్పడేవారన్నారు. చోరీ సొత్తును కొనుగోలు చేసిన పోతంకర్ దుర్గా రాజు(61)ను అరెస్టు చేసినట్లు తెలిపారు. దత్తు పరారీలో ఉన్నట్లు తెలిపారు. ఈ కేసును ఛేదించిన ఎస్సై ప్రవీణ్‌కుమార్, కానిస్టేబుల్ అప్సర్‌ను సీఐ నరహరి అభినందించారు.

తండ్రిని చంపిన కొడుకుకు జైలు

ఖలీల్‌వాడి : తండ్రిని కడతేర్చిన కొడుకుకు ఐదేళ్ల కఠిన జైలుశిక్ష విధిస్తూ నిజామాబాద్ సెషన్స్ జడ్జి సునీత కుంచాల గురువారం తీర్పు చెప్పారు. మోర్తాడ్ మండల కేంద్రానికి చెందిన ఏరుగట్ల గంగారాంకు ఇద్దరు కొడుకులు రవి, రాజు, ఇద్దరు కుమార్తెలు రాణి, లావణ్య ఉన్నారు. గంగారాం వేల్పూర్ మండలంలోని పడగల్ గ్రామం నుంచి మోర్తాడ్‌కు లక్ష్మి అనే మహిళను వివాహం చేసుకుని ఇల్లరికం వచ్చారు. భార్య నుంచి వచ్చిన ఆస్తిని తమకు ఇవ్వడం లేదనే విషయమై చిన్నకొడుకు తరచూ తండ్రితో గొడవకు దిగేవాడు. జూలై 27, 2018న రాజు ఒక మద్యం సేవిస్తుండగా తండ్రి తిట్టడంతో కోపోద్రిక్తుడైన రాజు తండ్రి కర్రతో కడుపులో కొట్టగా గంగారాం మృతి చెందాడు. రాజు నేరం రుజువైనందున ఐదేళ్ల శిక్షతోపాటు రూ.1,000 జరిమానా విధించారు. జరిమానా చెల్లించకపోతే అదనంగా మరో మూణ్నెళ్లు సాధారణ జైలుశిక్ష అనుభవించాలని తీర్పులో పేర్కొన్నారు. మోర్తాడ్ పోలీసుల తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ పిడుగు రవిరాజ్ వాదించారు.

అధికారి వేధింపులకు కార్మికుడి బలి

- శానిటేషన్ కార్మికుడి ఆత్మహత్య
- నేడు 'చలో మున్సిపల్'కు పిలుపు

నిజామాబాద్ నాగారం : మున్సిపాలిటీలో కార్మికులపై వేధింపులు ఆగడం లేదు. ముఖ్యంగా శానిటేషన్ విభాగంలో ఇన్‌చార్జి అధికారి ఉండడంతో పాలన అస్తవ్యస్తంగా మారుతోంది. ఇన్‌చార్జి ఎంహెచ్‌వో ఆర్నెళ్లుగా డ్యూటీ ఇవ్వడం లేదని పేర్కొంటూ అర్సపల్లి జోన్-5లో పనిచేసే రవి అనే కార్మికుడు మనస్థాపానికి గురై బుధవారం వసంత్‌నగర్‌లోని తన ఇంట్లో పురుగుల మందు ఆత్మహత్య చేసుకున్నారు. రవి మృతికి కారణమైన శానిటేషన్ అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్‌చేస్తూ బీఎల్‌టీయూ ఆధ్వర్యంలో శుక్రవారం 'చలో మున్సిపల్' కార్యక్రమాన్ని చేపట్టారు. నిజామాబాద్‌మున్సిపాలిటీ పరిధిలో శానిటేషన్ విభాగంలో మహిళలపై కూడా వేధింపులు ఆగడం లేదు. చిన్న కారణాలకే సిబ్బందిని పనిలోకి తీసుకోకుండా వేధిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. రవి అనే కార్మికుడు ఆర్నెళ్లుగా పని కోసం ఇన్‌చార్జి ఎంహెచ్‌వో ఆఫీస్‌కు చెప్పులరిగేలా తిరిగాడు. ఎంతకీ విధులు ఇవ్వకపోవడంతో మనస్తాపానికి గురై బుధవారం ఆయన ఆత్మహత్య చేసుకున్నాడని ఆరోపణలు వినిపిస్తున్నాయి. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

లారీని ఢీకొన్న కారు: పలువురికి స్వల్పగాయాలు



లారీ ఢీకొన్న కారు

బాల్కొండ : బాల్కొండ మండల కేంద్రంలో పాత జాతీయ రహదారి 44 పై లారీని వెనుక నుంచి కారు ఢీకొనడంతో కారులో ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. నిర్మల్ నుంచి ఆర్మూర్ వైపు వెళ్తున్న లారీ వెనుక కారు ప్రయాణిస్తుంది. లారీ డ్రైవర్ ఒక్క సారిగా బ్రేక్ వేయడంతో వెనుక వస్తున్న కారు అదుపు తప్పి లారీని ఢీకొట్టింది. దీంతో కారులో ప్రయాణిస్తున్న నిర్మల్‌కు చెందిన ఇద్దరికి స్వల్ప గాయలయ్యాయి. క్షతగాత్రులను ఆర్మూర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

పేకాడుతున్న నలుగురి అరెస్ట్

మోపాల్(నిజామాబాద్‌రూరల్) : మండలంలోని ముదక్‌పల్లి అటవీ ప్రాంతంలో పేకాటస్థావరంపై గురువారం సాయంత్రం దాడి చేసినట్లు ఎస్సై రాము తెలిపారు. నలుగురు వ్యక్తులు పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు దాడి చేశామన్నారు. ఇద్దరు పారిపోగా, మరో ఇద్దరిని అదుపులోకి తీసుకున్నామని పేర్కొన్నారు. వారి వద్ద నుంచి రూ.23,050, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు నమోదు చేశామని, ఇద్దరిని కోర్టులో సమర్పిస్తామని ఎస్సై తెలిపారు.

కేజీవీల్ ట్రాక్టర్ సీజ్


బాల్కొండ : మెండోరామండల కేంద్రానికి చెందిన జీవన్‌రెడ్డి తారు రోడ్డుపై కేజీవీల్స్ ట్రాక్టర్ నడుపుతూ వెళ్లడంతో ట్రాక్టర్‌ను మెండోరా పోలీసులు సీజ్ చేశారు. ఎలాంటి పట్టీలు లేకుండా కోడిచర్ల వైపు తారురోడ్డుపై కేజీవీల్‌తో వెళ్లడంతో రోడ్డు ధ్వంసమైందన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

కామారెడ్డి క్రైం : కుమారునికి జ్వరం రావడంతో ఓ కుటుంబం ఆస్పత్రికి వెళ్లి తిరిగి వచ్చేసరికి అగంతకులు ఇల్లుగుల్ల చేశారు. ఈ ఘటన కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని దేవునిపల్లిలో గురువారం ఉదయం వెలుగు చూసింది. దోమకొండకు చెందిన కంది రవీచందర్ దేవునిపల్లిలో అద్దెకు ఉంటున్నాడు. అతని కుమారుడు హర్షవర్ధన్‌కు జ్వరంరావడంతో బుధవారం రాత్రి 7:30 గంటల ప్రాంతంలో ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. వైద్యులు అడ్మిట్ చేసుకోవడంతో రాత్రి ఇంటికి వచ్చి 11 గంటల ప్రాంతంలో భోజనం చేసి తిరిగి ఆస్పత్రికి వెళ్లారు. ఇంటికి తాళం వేసి ఉండడాన్ని గమనించిన దొంగలు చోరీకి పాల్పడ్డారు. బీరువాలోని 13 మాసాల బంగారు అభరణాలు, రూ. 42 వేల నగదును ఎత్తుకెళ్లారు. దేవునిపల్లి పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. క్లూస్ టీం ఆధారాలు సేకరించారు. కేసును దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజు పేర్కొన్నారు.

క్రైం కార్నర్

క్రషర్ గుంతలో మునిగి యువకుడి మృతి



ప్రమాదకరంగా ఉన్న క్రషర్ గుంతలు



భీంరావు(ఫైల్)

నస్రుల్లాబాద్(బాన్సువాడ) : అధికారుల విధి నిర్లక్ష్యానికి నిండు ప్రాణం బలైన ఘనట నస్రుల్లాబాద్‌లో చోటు చేసుకుంది. మండల కేంద్రంలో ఉన్న బీవీఎస్ఆర్ పేరుతో ఏర్పాటు చేసిన క్రషర్ భూమిలో పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. అయితే ప్రస్తుతం కంకర క్రషింగ్ నిలిచిపోయినా కంకర కొద్దిగా ఉండడంతో పనులు సాగుతున్నాయి. మండల కేంద్రంలో మహారాష్ట్రలోని నాందేడ్ గ్రామానికి చెందిన భీంరావు(23) గురువారం తోటి మిత్రులతో కలిసి మేకలను మేపేందుకు మైలారం–నస్రుల్లాబాద్ మధ్య గల క్రషర్ ప్రాంతానికి వెళ్లాడు. అక్కడ ఉన్న క్రషర్ గుంతలోని నీళ్లలోని మేకలను దింపారు. తిరికి వాటిని తీసుకొచ్చేందుకు ముగ్గురు మిత్రులు దిగగా భీంరావు మాత్రం నీటిలో మునిగి మృతి చెందాడు. స్నేహితులు కేకలు వేయడంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. గతంలోను క్రషర్‌లో పని చేసే కుటుంబంలోని బాలిక కూడా ఈ భారీ నీటిగుంతలో మునిగి మృతిచెందిందని, ఓ మహిళ కుటుంబ కలహాలతో మనస్తాపంతో ఈ క్రషర్ గుంతలో దూకగా తీవ్ర గాయాలయ్యాయని పలువురు పేర్కొంటున్నారు. క్రషర్ గుంత చుట్టూ కంచె, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

అనారోగ్యంతో వార్డు సభ్యురాలి మృతి



బాలవ్వ (ఫైల్)

పిట్లం(జుక్కల్) : మండలంలోని గౌరారం గ్రామ పంచాయతీ 6వ వార్డు సభ్యురాలు దుంపల బాలవ్వ (55) గురువారం మృతి చెందారు. గ్రామ సర్పంచ్ అనసూయ మాట్లాడుతూ వార్డు సభ్యురాలు దుంపల బాలవ్వ కొన్నిరోజుల క్రితం అనారోగ్యానికి గురైందని, గురువారం ఉదయం తీవ్ర జ్వరం రావడంతో ఆరోగ్యం బాగా క్షీణించి మృతి చెందినట్లు తెలిపారు. ఆమె అంత్యక్రియలను గ్రామంలో నిర్వహించారు.

రైలు నుంచి పడి వ్యక్తికి గాయాలు

బోధన్‌టౌన్(బోధన్): బోధన్ పట్టణం రాకాసీపేట్‌లో రైల్వేస్టేషన్‌లో బుధవారం రాత్రి 11 గంటల సమయంలో వచ్చిన మహబూబ్‌నగర్–బోధన్ ప్యాసింజర్ రైలు నుండి కిందికి దిగి వెళ్తుండగా లతీఫ్(48)కు తీవ్ర గాయాలయ్యాయి. లతీఫ్ బుధవారం రాత్రి మహబూబ్‌నగర్– బోధన్ ప్యాసింజర్ రైలులో వచ్చాడు. రైలు దిగి వెళ్తుంగా పట్టుతప్పి పట్టాలపై పడ్డాడు. అదే సమయంలో రైలు ఇంజిన్ అదే పట్టాలపై వెళ్తూ లతీఫ్ చేయి మీదుగా వెళ్లడంతో లతీఫ్ చేయి తెగింది. 108లో ఆ స్పత్రికి తరలించారు. బాధితుడు రాకాసీపేట్‌కు చెందినట్లుగా పోలీసులు గుర్తించారు.

డ్రంకన్ డ్రైవ్‌లో ఒకరికి జైలు

కామారెడ్డి క్రైం: మద్యం సేవించి వాహనం నడిపిన కేసులో కామారెడ్డి కోర్టు ఒకరికి రెండు రోజుల జైలు శిక్ష విధించింది. రెండు రోజుల క్రితం దేవునిపల్లి పోలీసులు వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా కామారెడ్డి మండలం రాఘవపూర్ గ్రామానికి చెందిన బాలయ్య అనే వ్యక్తి డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుబడ్డాడు. అతడిని గురువారం కోర్టుకు హాజరుపర్చారు. నిందితునికి ద్వితీయ శ్రేణి న్యాయమూర్తి ప్రతాప్ రెండు రోజుల జైలు శిక్ష, రూ. 200 జరిమానా విధించినట్లు ఎస్సై రాజు తెలిపారు.

భిక్కనూరు : మండలకేంద్రంలోని పోలీస్‌స్టేషన్ పరిధిలో మద్యం సేవించి వాహనం నడిపిన ఒక్కరికి రెండురోజుల జైలుశిక్ష పడినట్లు భిక్కనూరు ఎస్సై సాయికుమార్ గురువారం తెలిపారు. మండల కేంద్రానికి చెందిన స్వామి మద్యం సేవించి వాహనం నడుపుతూ పోలీసులకు పట్టుబడ్డారు.

అత్తింటి వేధింపులకు యువకుడి బలి

ఖలీల్‌వాడి : నగరంలోని నాల్గో టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని వినాయక్‌నగర్‌కు చెందిన ఆసర్ల శ్రీనివాస్(29) అత్తింటి వేధింపులకు ఉరి వేసుకొని మృతి చెందినట్లు ఎస్సై సంజీవ్ తెలిపారు. ఎస్సై తెలి పిన వివరాలు ఇలా ఉన్నాయి. శ్రీనివాస్‌కు బోధన్ కు చెందిన భాగ్యతో వివాహం జరిగింది. అయితే అత్త ఇంటికి ఇల్లరికం రావాలని తరుచూ వారు వేధించడంతో పలుమార్లు పంచాయతీలు జరిగినట్లు తెలిపారు. ఇల్లరికం వెళ్లిన శ్రీనివాస్‌ను అత్తమామతో పాటు బామ్మర్ది, భార్య గొడవలకు దిగి కొట్టినట్లు చెప్పారు. దీంతో మనస్థాపం చెందిన శ్రీనివాస్ సొంతింటికి వచ్చి ఉరివేసుకున్నట్లు చెప్పారు. మృతుడు శ్రీనివాస్ తండ్రి అసర్ల మల్లేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మామ చిన్నకోట్ల సాయిలు, అత్త సావిత్రి, బామ్మర్ది మహేష్ తోపాటు మృతుడి భార్య భాగ్యపై కేసు నమోదు చేశామన్నారు.

ఇద్దరు కానిస్టేబుళ్ల అటాచ్

ఖలీల్‌వాడి : నగరంలోని ఐదవ టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని అలకుంట రాజు(28) పోలీస్‌స్టేషన్‌లో పెట్రోల్ పోసుకొని మృతి చెందిన కేసులో ఇద్దరు కానిస్టేబుళ్లను నవీపేట్, మాక్లూర్ పోలీస్‌స్టేషన్లకు అటాచ్ చేశారు. తరుచూ డయల్ 100కు ఫోన్ చేయడంతో పోలీసులు రాజును చితకబాదినట్లు ఆరోపణలు ఉన్నాయి. దీంతో ఆరోపణలు వచ్చిన ఇద్దరు కానిస్టేబుళ్లపై నివేదికను సీపీకి పంపించినట్లు తెలిసింది. దీంతోపాటు పోలీసులు మృతుడి తల్లిని విచారణ చేయగా భార్య తోపాటు బంధవులు ఇబ్బందులు చేసినట్లు స్పష్టం చేసినట్లు సమాచారం సీపీ నిర్ణయం మేరకే కానిస్టేబుళ్లపై చర్యలు ఉంటాయనే చర్చ పోలీస్‌వర్గాలలో వినిపిస్తుంది.